సాక్షి
కామారెడ్డి
బుధవారం । 8 । నవంబర్ । 2023



రైతులకు వరుణుడి బెంగ

ఆకాశంలో మబ్బులు రైతుల్లో ఆందోళనకు కారణమవుతున్నాయి. దీంతో వారు ఆరబోసిన ధాన్యాన్ని కాపాడుకునే పనిలో పడ్డారు.

- IIIలో ▸



సైన్స్‌పై అవగాహన ఉండాలి

ప్రతిఒక్కరూ సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని డీఈవో రాజు పేర్కొన్నారు. పట్టణంలో సైన్స్ ఫెస్టివల్‌లో ప్రసంగించారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
31.2 /22.1

వాతావరణం

ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లటి గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది. కనిష్ట ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.

న్యూస్‌రీల్

రేపు కామారెడ్డికి గులాబీ బాస్ రాక!

- ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్
- ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగం

సాక్షి, కామారెడ్డి : బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఈనెల 9న(గురువారం) కామారెడ్డిలో జరిగే బహిరంగసభలో ప్రసంగించనున్నారు. హెలికాప్టర్‌లో కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఉన్న హెలిపాడ్ వద్ద దిగనున్నారు. అక్కడి నుంచి నేరుగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గ్రౌండ్స్‌లో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. నామినేషన సందర్భంగా ఊరూరు నుంచి భారీ ఎత్తున జనం తరలివచ్చేలా బీఆర్‌ఎస్ నేతలు ఏర్పాట్లు చేశారు. కామారెడ్డి ఇన్‌చార్జ్‌గా ఉన్న మంత్రి కేటీఆర్ ఇంటికొకరు తరలిరావాలని పిలుపునిచ్చారు. నియోజక వర్గంలోని మాచారెడ్డి, కామారెడ్డి, దోమకొండ, భిక్కనూరు సభల్లో సీఎం కేసీఆర్ నామినేషన్ కార్యక్రమం, సభ గురించి కేటీఆర్ ప్రత్యేకంగా మాట్లాడారు. సభకు వచ్చిన జనాన్ని చూసి ప్రతిపక్షాల దిమ్మె తిరగాలన్నారు. లక్ష మందిని సమీకరించాలన్న లక్ష్యంతో సభ ఏర్పాటు చేసినట్లు బీఆర్‌ఎస్ నేతలు తెలిపారు. ఎన్నికల ఇన్‌చార్జ్ సుభాష్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌ల ఆధ్వర్యంలో జనసమీకరణ జరుగుతోంది. మండలానికో ఇన్‌చార్జ్‌ని నియమించి వారి ద్వారా ఆయా మండలాల నుంచి పెద్ద ఎత్తున జనాన్ని సమీకరిస్తున్నారు.

నేడు బీజేపీ అభ్యర్థి రమణారెడ్డి నామినేషన్

- హాజరుకానున్న కేంద్ర మంత్రి పరుషోత్తం రూపాల

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి కాటిపల్లి వెంకట రమణా రెడ్డి నేడు తన నామినేషన్ దాఖలు చేయనున్నట్లు మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర ఫిషరిష్, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ శాఖల మంత్రి పురుషోత్తం రూపాల హాజరవుతున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకు ఈ నామినేషన్ కార్యక్రమానికి కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

నాటు తుపాకీ లభ్యం




ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగరంలోని నిజాం కాలనీలో ఓ గోదాంలో పీడీఎస్ బియ్యం నిల్వ ఉన్నట్లు సమాచారం అందడంతో తనిఖీలకు వెళ్లిన పోలీసులకు నాటు తుపాకీ, కత్తులు దొరికాయి. దీంతో పోలీసులు విస్తుపోయారు. పీడీఎస్ బియ్యం, దొరికిన ఆయుధాలు స్వాధీనం చేసుకొని నగరంలోని మాలపల్లికి చెందిన మీర్ అంజాద్ బేగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అంజాద్ బేగ్ తండ్రి గతంలో వివిధ కేసుల్లో జైలు శిక్ష అనుభవించినట్లు పోలీసులు గుర్తించారు. కంట్రీ మేడ్ తుపాకులు ఎలా వచ్చాయనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ తనిఖీల్లో సౌత్ సీఐ వెంకటనారాయణ, ఆరో టౌన్ ఎస్సై రవీందర్ తనిఖీల్లో పాల్గొన్నారు.

లెక్క తేలింది.. పోరు మిగిలింది..

ఎన్నికల సంగ్రామంలో నామినేషన్ల ఘట్టం తుదిదశకు చేరింది. ప్రధాన పార్టీలు అభ్యర్థులను ఖరారు చేశాయి. నాలుగు నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు తేలిపోయారు. ఇప్పటికే కొందరు నామినేషన్లు వేయగా, మరికొందరు నేడు, రేపు, ఎల్లుండి వేయడానికి రెడీ అయ్యారు. ఇప్పటికే అన్ని పార్టీల అభ్యర్థులు తమ ప్రచారానికి పదును పెట్టారు. హామీల వర్షం కురిపిస్తున్నారు.

- నాలుగు చోట్ల ప్రధాన పార్టీలకు అభ్యర్థుల ఖరారు
- నియోజకవర్గాల్లో నామినేషన్ల సందడి
- బహిరంగ సభలు, ప్రచారంపై ఫోకస్



కేసీఆర్, (బీఆర్‌ఎస్) కామారెడ్డి
పోచారం (బీఆర్‌ఎస్-బాన్సువాడ)
అరుణతార (బీజేపీ-జుక్కల్)
రేవంత్‌రెడ్డి (కాంగ్రెస్-కామారెడ్డి)
జాజాల సురేందర్ (బీఆర్‌ఎస్-ఎల్లారెడ్డి)
మదన్ మోహన్‌రావ్ (కాంగ్రెస్-ఎల్లారెడ్డి)
ఏనుగు రవీందర్‌రెడ్డి (కాంగ్రెస్-బాన్సువాడ)
వెంకటరమణారెడ్డి (బీజేపీ-కామారెడ్డి)
యెండల (బీజేపీ-బాన్సువాడ)
హన్మంత్‌సింధే (బీఆర్‌ఎస్-జుక్కల్)
సుభాష్‌రెడ్డి (బీజేపీ-ఎల్లారెడ్డి)
లక్ష్మీకాంత్‌రావ్ (కాంగ్రెస్-జుక్కల్)

సాక్షి, కామారెడ్డి : ఆ యా పార్టీలకు సంబంధించి అభ్యర్థుల ఖరారు పూర్తికావడంతో నామినేషన్ల తో పాటే ర్యాలీలు, సభలకూ ప్లాన్ చేశారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లో మూడు ప్రధాన పార్టీలు అభ్యర్థులను ప్రకటించాయి. ఈ నెల 10న నామినేషన్ల దాఖలుకు చివరిరోజు కావడంతో బుధ, గురు, శుక్ర వారాల్లో నామినేషన్లు దాఖలు కానున్నాయి. ఇప్పటికే పలువురు అభ్యర్థులు తమ అనుచరులు, కుటుంబ సభ్యులతో ఒకటి రెండు సెట్లు దాఖలు చేశారు. ఒకరిద్దరు స్వయంగా వెళ్లి నామినేషన్లు వేశారు. అయితే నామినేషన్ల రోజున భారీ జనసమీకరణతో సభలు, ర్యాలీలు నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నారు. నామినేషన్ల ఘట్టం పూర్తవగానే ప్రచారం వేడెక్కనుంది. అధికార పార్టీ అందులో ముందు వరుసలో ఉంది. జుక్కల్, బాన్సువాడ నియోజక వర్గాల్లో సీఎం ఎన్నికల ప్రచార సభలు పూర్తయ్యాయి. ఈ నెల 9న కామారెడ్డిల్లో జరిగే సభల్లో సీఎం పాల్గొననున్నారు.

ఎల్లారెడ్డిలో..

జిల్లాలో మరో నియోజక వర్గం ఎల్లారెడ్డిలో అభ్యర్థుల లెక్క తేలిపోయింది. ఇక్కడ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మదన్‌మోహన్‌రావ్ బరిలో నిలిచారు. ఈనెల 8న (బుధవారం) భారీ జనసమీకరణతో నామినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆయన ప్లాన్ చేశారు. కాగా కాంగ్రెస్ టిక్కెట్ ఆశించి భంగపడ్డ వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి బీజేపీలో చేరి ఆ పార్టీ అభ్యర్థిత్వాన్ని దక్కించుకున్నారు. దీంతో ఇక్కడ మూడు ప్రధాన పార్టీలకు అభ్యర్థులను ప్రకటించినట్టయ్యింది. కాగా నియోజకవర్గంలో మూడు పార్టీలు చేరికల జాతర నడిపిస్తున్నాయి. ఈపార్టీ వాళ్లు ఆ పార్టీలోకి, ఆ పార్టీ వాళ్లు ఈ పార్టీలోకి వెళ్తున్నారు.

సింధేతో లక్ష్మీకాంత్‌రావ్, అరుణతార ఢీ..

ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం జుక్కల్‌లో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పోటీ చేస్తున్నారు. నియోజకవర్గంలో సీఎం కేసీఆర్‌తో బహిరంగ సభ కూడా పూర్తయ్యింది. ఊరూరా తిరుగుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఆయనకు ప్రత్యర్థులుగా బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే అరుణతార పోటీ చేస్తున్నారు. అరుణతార ఇప్పటికే నామినేషన్ కూడా వేశారు. కాంగ్రెస్ అభ్యర్థిగా లక్ష్మీకాంత్‌రావ్ అభ్యర్థిత్వం ఖరారైంది. ఆయన నామినేషన్ వేసి ప్రచారంలోకి వెళ్లేందుకు ప్లాన్ చేశారు. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారం తనకు టిక్కెట్ రాకపోవడతో ఏం చేస్తాడన్నదానిపై ఉత్కంఠ నెలకొంది.

కామారెడ్డిలో బిగ్‌ఫైట్

సీఎం కేసీఆర్, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పోటీ చేస్తుండడంతో కామారెడ్డి నియోజకవర్గం రాష్ట్రం అందరి దృష్టిని ఆకర్శిస్తోంది. వారిద్దరితో బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి తలపడుతున్నారు. బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి ఈనెల 8న (బుధవారం) నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల హాజరవుతున్నారు. సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఈ నెల 9 న(గురువారం) నామినేషన్ దాఖలు చేయనున్నారు. అదే రోజు జిల్లా కేంద్రంలో భారీసభలో ఆయన ప్రసంగిస్తారు. 10న (శుక్రవారం) కాంగ్రెస్ అభ్యర్థిగా పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేస్తారు. అదే రోజు జిల్లా కేంద్రంలో భారీ సభ నిర్వహిస్తారు. కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అతిథిగా హాజరవుతున్నారు. అలాగే నియోజకవర్గంలో బీఎస్పీ, బీఎల్‌టీయూ తదితర పార్టీలు, స్వతంత్రులు భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేసే అవకాశాలున్నాయి.

పోచారంతో పోరుకు ఏనుగు, యెండల సై..

బాన్సువాడ నియోజక వర్గంలో సీనియర్ నాయకుడు పోచారం శ్రీనివాస్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యేలు ఏనుగు రవీందర్‌రెడ్డి, యెండల లక్ష్మీనారాయణలు పోటీ పడుతున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎల్లారెడ్డి నుంచి పోటీ చేస్తున్నారు. అలాగే నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ బీజేపీ అభ్యర్థిగా పోటీ పడుతున్నారు. నియోజకవర్గంలో గట్టి పట్టున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డిని ఢీకొనేందుకు ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు తలపడుతుండడంతో రాజకీయం రసవత్తరంగా మారింది. ఇక్కడ సీఎం కేసీఆర్‌తో ఎన్నికల ప్రచార సభ ఇప్పటికే నిర్వహించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి ఊళ్లన్నీ చుట్టేసి ప్రత్యర్థులకన్నా నాలుగు అడుగుల ముందే ఉన్నారు.

ఆ ఇద్దరి దారెటు..?

- బాన్సువాడ, జుక్కల్ కాంగ్రెస్‌లో తిరుగుబాటు
- అభ్యర్థిని మార్చకుంటే దీక్ష చేపడతానంటున్న కాసుల
- రెబల్‌గా బరిలో నిలుస్తానంటున్న గంగారాం



సౌదాగర్ గంగారాం   కాసుల బాల్‌రాజు

సాక్షి, కామారెడ్డి : బాన్సువాడ, జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వం కోసం చివరిదాకా ప్రయత్నించిన ఇద్దరు నేతలు తిరుగుబాటు చేయడానికి సిద్ధంగా ఉన్నారా? అంటే అవుననే సమాధానలు వస్తున్నాయి. జుక్కల్ మాజీ ఎమ్మెల్యే సౌదాగర్ గంగారాం నాలుగైదు దశాబ్దా లుగా కాంగ్రెస్ పార్టీకి నాయకత్వం వహిస్తూ వచ్చారు. ఈసారి కూడా టిక్కెట్ వస్తుందన్న ఆశతో ఉండి ఢిల్లీలో మకాం వేసి చివరిదాకా ప్రయత్నం చేశారు. జాబితాలో తన పేరు ఉందని తెలిసి సంబరపడ్డారు. చివరికి ఆయనకు కాంగ్రెస్ అధిష్టానం మొండిచేయి చూపింది. తోట లక్ష్మీకాంతరావ్‌కు టిక్కెట్ ప్రకటించడంతో ఆయన పార్టీ నాయకత్వంపై తిరుగుబాటు చేయడానికి రెడీ అయ్యా రు. బుధవారం పెద్దకొడప్‌గల్‌లో తన అనుచరులతో సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. అభ్యర్థిని మార్చాల్సిందేనని లేదంటే తాను రెబల్‌గా బరిలో ఉంటా నని స్పష్టం చేస్తున్నారు. నామినేషన్ వేస్తానని కూడా ప్రకటించారు. బాన్సువాడ నియోజక వర్గంలో కాసు ల బాల్‌రాజు టిక్కెట్ రాకపోవడంతో మంగళవారం తన అనుచరులతో సమావేశమయ్యారు. అందరి అభిప్రాయాలు తీసుకు న్నాక పార్టీ అభ్యర్థి మార్పు చేయాలని, లేని పక్షంలో నిరాహార దీక్షకు దిగుతానని ప్ర కటించారు. దీంతో రెండు నియోజక వర్గాల్లో రాజకీయాలు రసవత్తరంగా మారాయి.

మరో మూడు రోజులే..



కామారెడ్డిలో నామినేషన్ వేస్తున్న స్వతంత్ర అభ్యర్థి తాహెర్



జుక్కల్‌లో నామినేషన్ వేస్తున్న స్వతంత్ర అభ్యర్థి వాగ్మారే గంగాధర్

- కామారెడ్డిలో 6, బాన్సువాడలో 3
- ఎల్లారెడ్డి, జుక్కల్‌లో ఒక నామినేషన్

కామారెడ్డి క్రైం : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నామినేషన్లు వేసేందుకు మరో మూడురోజులు మాత్రమే ఉంది. మంగళవారం జి ల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 11 నామినేషన్లు దాఖలయ్యాయి. కామారెడ్డిలో 6, బాన్సువాడలో 3, జుక్కల్, ఎల్లారెడ్డిలో ఒక్కో నా మినేషన్ చొప్పున దాఖలైంది. బాన్సువాడలో బీఆర్‌ఎస్ అభ్యర్థి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తరపున ఆయన కుమారుడు భాస్కర్‌రెడ్డి, మరో నాయకుడు కలిసి రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశా రు. బాన్సువాడ బీఎస్పీ అభ్యర్థిగా నీరడి ఈశ్వర్ నామినేషన్ వేశారు. ఎల్లారెడ్డిలో స్వతంత్ర అభ్యర్థి గా మోడెగావ్ మహేష్, జుక్కల్‌లో స్వతంత్ర అభ్యర్థిగా వాగ్మారే గంగాధర్ నామినేషన్ వేశారు. కామారెడ్డిలో స్వతంత్ర అభ్యర్థులుగా అకుల హరీష్, చిదుర సాగర్‌రెడ్డి, రవినాయక్ బుక్యా, రాజగిరి సంతోష్‌రెడ్డి, సుమన్, మహ్మద్ తాహెర్ బిన్ అహ్మద్‌లు నామినేషన్లు వేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

పోలింగ్ శాతం పెంచాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

కామారెడ్డి క్రైం : శాసనసభ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర స్థాయి ఉన్నతస్థాయి అధికారులతో కలిసి అసెంబ్లీకి జరగబోయే సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలతో వీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత పోటీలో ఉండే అభ్యర్థుల సంఖ్య ఆధారంగా అవసరమైన మేర ఈవీఎం యంత్రాలు సర్దుబాటు చేయాల్సి ఉంటుందన్నారు. అవసరమైతే అదనపు బ్యాలెట్ యూనిట్లను జిల్లాకు అందిస్తామన్నారు. నవంబర్ 18న రెండవ దశ ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ చేపట్టాలన్నారు. పెండింగ్ ఓటరు నమోదు దరఖాస్తులను మూడు రోజుల్లోగా పరిష్కరించాలని సూచించారు. తనిఖీలు, పట్టుకున్న నగదు, వస్తువుల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఓటరు స్లిప్ లను త్వరగా ముద్రించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ముగిసిన వెంటనే పంపిణీ ప్రారంభించాలన్నారు. జిల్లాలో ఒక నోడల్ అధికారిని నియమించి ప్రతిరోజు ఓటర్ స్లిప్పుల పంపిణీపై సమీక్ష నిర్వహించాలన్నారు. గతంలో తక్కువ పోలింగ్ నమోదైన పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించాలన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ సింధు శర్మ, అధికారులు

ఓటరు స్లిప్పులను సిద్ధం చేయాలి..

వీసీ అనంతరం కలెక్టర్ జితేష్ వి పాటిల్ జిల్లా అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 15న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం బరిలో నిలిచే అభ్యర్థులకు గుర్తులు కేటాయించి బ్యాలట్ పేపర్ ముద్రణ చేపట్టాలన్నారు. 15 మంది అభ్యర్థుల కంటే ఎక్కువ మంది ఉన్న చోట అదనంగా ఈవీఎంలను సర్దుబాటు చేయాలన్నారు. ఫారం-12డీ దరఖాస్తు చేసుకున్న వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుండే ఓటు వేసేలా విధంగా బృందాలు సిద్ధంగా ఉంచాలన్నారు. ఓటర్ స్లిప్పుల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. 16న రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి అనుమతుల స్వీకరణ, వ్యయ నిర్వహణపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ సింధు శర్మ, అదనపు కలెక్టర్ చంద్ర మోహన్, నోడల్ అధికారులు కిషన్, సురేందర్ కుమార్, సింహారావు, శ్రీనివాస్, మల్లికార్జున్ బాబు, శ్రీధర్ రెడ్డి, సతీష్ యాదవ్, శాంతికుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి కాంగ్రెస్‌లో జోష్..!

- భారీగా చేరుతున్న ప్రజాప్రతినిధులు, శ్రేణులు
- పార్టీ అసంతృప్తులకు బుజ్జగింపులు
- నియోజకవర్గంలో మదన్‌మోహన్ సుడిగాలి పర్యటనలు

సాక్షి, కామారెడ్డి : ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో కొత్త జోష్ కనిపిస్తోంది. పార్టీ అభ్యర్థి మదన్‌మోహన్ పార్టీ నేతలతో కలిసి సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. సొంత పార్టీలో అసంతృప్తులను కలిసి వారిని బుజ్జగించారు. అలాగే ఇతర పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులతో సంప్రదింపులు జరుపుతూ వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. ఇటీవల లింగంపేట జెడ్పీటీసీ సభ్యురాలు ఏలేటి శ్రీలత కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాజాగా నాగిరెడ్డిపేట మండలానికి చెందిన పలువురు సర్పంచ్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేసి సుభాష్‌రెడ్డి వెంట తిరిగిన జెడ్పీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డితో పాటు పోసానిపేట సర్పంచ్ గీరెడ్డి మహేందర్‌రెడ్డిల ఇళ్లకు వెళ్లి వారిని సముదాయించి పార్టీ కోసం పని చేయాలని కోరారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ప్రత్యర్థి పార్టీలకు చెందిన నేతలపై ఆయన ఫోకస్ చేస్తున్నారు. ముఖ్యంగా అధికారపార్టీకి చెందిన నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులకు వల విసురుతున్నారు. క్యాడర్ లో జోష్ నింపేలా చేరికలు జరుగుతున్నాయి. నా మినేషన్ కార్యక్రమానికి భారీ ఎత్తున జనాన్ని, పార్టీ శ్రేణులు తరలివచ్చేలా ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో తరలివస్తే దాని ప్రభావం ఎక్కువగా ఉంటుందని ఆయన భావిస్తున్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్

బీఆర్‌ఎస్‌తో మరింత అభివృద్ధి

- ప్రభుత్వవిప్ గంపగోవర్ధన్

కామారెడ్డి క్రైం : బీఆర్‌ఎస్‌తోనే ప్రజలకు మంచి జరిగిందని ప్రభుత్వవిప్ గంపగోవర్ధన్ అన్నారు. మంగళవారం కామారెడ్డిలోని శుభం కన్వెన్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. రాష్ట్రం రాకముందు పంట పొలాల్లోని మోటార్లు కాలిపోయేవని, ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయేవన్నారు. తెలంగాణ వచ్చాక 24 గంటల కరెంట్ ఇచ్చి రైతుల కష్టాలు తీర్చిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. గొల్ల, కురుమల అభ్యున్నతికి కేసీఆర్ ప్రభుత్వం విశేషంగా కృషి చేసిందన్నారు.



కార్యకర్తలను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న విప్

భారీగా చేరికలు..

కామారెడ్డి మండలం అడ్లూర్, రామేశ్వర్‌పల్లి, దేవునిపల్లి, టేక్రియాల్, శాబ్దిపూర్, లింగాయిపల్లి, క్యాసంపల్లి, గర్గుల్, రామారెడ్డి మండలం అన్నారం మద్దికుంట, రాజంపేట, కంచర్ల, ఆరేపల్లి, పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలకు చెందిన దాదాపు 1500 మంది ప్రభుత్వవిప్ గంపగోవర్ధన్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అంతకుముందు ప్రభుత్వవిప్ నివాసంలో రామేశ్వర్‌పల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు బాల కిషన్‌గౌడ్, అడ్లూర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు హాఫీజ్ ఆయా పార్టీలకు రాజీనామా చేసి ప్రభుత్వవిప్ సమక్షంలో బీఆర్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దిన్, సీనియర్ నాయకుడు నిట్టు వేణుగోపాల్ రావు, వైస్ ఎంపీపీ నరేష్, జోగుల గంగాధర్, నాగల్ల రాజేందర్, గట్టుగోని గోపిగౌడ్, నిమ్మమోహన్‌రెడ్డి, లద్దూరి లక్ష్మీపతియాదవ్ ఉన్నారు.

వెనక్కి తగ్గిన లబానా లంబాడీలు

- ఎస్టీ జాబితాలో చేర్చాలని గతంలో డిమాండ్
- కేసీఆర్‌పై 1016 నామినేషన్లు వేస్తామని ప్రకటన
- మంత్రి హరీశ్ హామీతో ప్రకటనను ఉపసంహరించుకున్న నేతలు



కామారెడ్డి టౌన్ : లబానా లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ లబానా(కాయితీ) లంబాడీల సంఘం ఆధ్వర్యంలో గతంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేసిన విషయం తెలిసిందే. జిల్లాకేంద్రంలో పెద్దఎత్తున ర్యాలీ, కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో తమ డిమాండ్ సాధన కోసం కామారెడ్డి అసెంబ్లీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్‌పై 1016 నామినేషన్లు వేస్తామని నేతలు ఉద్యమసమయంలో ప్రకటించారు. ఇప్పుడు ఆ నేతలు వెనక్కి తగ్గారు. తమ నిర్ణయాన్ని ఉపసంహరిస్తున్నట్లు ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుతో నాయకులు చర్చలు జరిపారు. లబానాలను ఎస్టీ జాబితాలో చేర్చడంతో పాటు, సంక్షేమ బోర్డు ఏర్పాటు అంశాలపై మంత్రితో చర్చించారు. ఎన్నికల అనంతరం తప్పకుండా డిమాండ్లను పరిశీలిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు లబానా లంబాడీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తానసింగ్ నాయక్ తెలిపారు. ఇక కేసీఆర్‌కు వ్యతిరేకంగా వేస్తామన్న నామినేషన్ల ప్రకటనను ఉపసంహరిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, నాయకులు అమర్‌సింగ్‌నాయక్, చందానాయక్, బిషన్‌లాల్, జగదీష్, గంగారం తదితరులున్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



బాన్సువాడ రూరల్ : కాంప్లెక్స్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పరిశీలకులు కిషన్, వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం వారు బీర్కూర్ జెడ్పీహైస్కూల్‌లో కొనసాగుతున్న శిక్షణ శిబిరాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. వారి వెంట ఎంఈవో నాగేశ్వరరావు ఉన్నారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



నిజామాబాద్‌నాగారం: జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి శంషాబాద్ ఎయిర్‌ఫోర్ట్‌కు చేరుకున్న జిల్లా క్రీడాకారుల బృందానికి అధికారులు, నిర్వాహకులు మంగళవారం ఘన స్వాగతం పలికారు. ఈ నెల 1 నుంచి 6 వరకు పంజాబ్‌లో నిర్వహించిన ఎంఎల్‌బీ బేస్‌బాల్ నేషనల్ కప్-2023 పోటీల్లో రాష్ట్ర స్ట్రైకర్స్ జట్టు తృతీయ స్థానం పొందింది. ఇందులో జిల్లాకు చెందిన క్రీడాకారులు నిహాల్ చంద్ర, కిశోర్, శ్రీశాంత్, వర్షిత్, జ్ఞానేశ్వర్, యశ్వంత్, వశీకరణ్, అక్షిత్, అశ్విత్, రోహిత్, శశాంక్, శ్రేయాన్ ఉత్తమ ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. అనంతరం జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి వినోద్, కోచ్‌లు నరేశ్, అనిల్, క్రీడాకారులకు పలువురు అభినందనలు తెలిపారు. క్రీడాకారులకు స్వాగతం పలికిన వారిలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ విద్యాసంస్థల స్పోర్ట్స్ ఆఫీసర్ రామలక్ష్మయ్య, నోడల్ ఆఫీసర్ శేషకుమారి, జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గంగామోహన్, పీఈటీ రాజేందర్, క్రీడాకారుల తల్లిదండ్రులు ఉన్నారు.

శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలి



కామారెడ్డి టౌన్: సైన్స్ పట్ల ప్రతి ఒక్కరు శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలని డీఈవో ఎస్.రాజు సూచించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి సైన్స్ డ్రామా ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 100 మంది పైగా విద్యార్థులు మూఢ నమ్మకాలు, సైన్స్ పురోగతి, ఆహారం, ఆరోగ్యం, చిరుధాన్యాల ప్రాధాన్యత అంశాలపై సైన్స్ ప్రదర్శలను ఇచ్చారు. బహుమతుల ప్రదానం కార్యక్రమానికి డీఈవో ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు జ్ఞాపికలు, ప్రసంశా పత్రాలను అందజేశారు. జిల్లా సైన్స్ అధికారి సిద్దిరాం రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం గంగా కిషన్, జిల్లా అకాడమిక్ కో-ఆర్డినేటర్ కృష్ణాకర్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ గర్జనకు తరలిన బీజేపీ శ్రేణులు

సాక్షి నెట్‌వర్క్: హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన బీసీ గర్జన సభకు జిల్లా నుంచి భారీగా బీజేపీ శ్రేణులు తరలి వెళ్లాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి రాగానే బీసీనే ముఖ్యమంత్రిని చేస్తానని ప్రధాని మోదీ ప్రకటించారని గుర్తు చేశారు. బీసీలందరూ బీజేపీకి ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు.

నిస్వార్థ సేవే తన లక్ష్యం

- కౌన్సిలర్ నుంచి మంత్రి వరకు ఎదిగిన వైనం
- 30 ఏళ్లుగా సాదాసీదా జీవనం
- మాజీ మంత్రి డి సత్యనారాయణ జీవనశైలిపై కథనం..



మాజీ మంత్రి డి సత్యనారాయణ

జంగ్ తెలంగాణ

నిజామాబాద్‌నాగారం: ప్రజలకు అందించిన నిస్వార్థ సేవతోనే తనను 30 ఏళ్లు రాజకీయాల్లో కీలక పదవులు అనుభవించేలా చేసింది. ప్రజా సమస్యలను తన సమస్యగా భావించి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుండి నడిపించడంలో కీలకపాత్ర పోషించిన మాజీ మంత్రి డి సత్యనారాయణ నేటితరం నాయకులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. గత ఎన్నికల్లో డబ్బులు ఖర్చు చేయకుండానే ప్రజల సహకారంతో కౌన్సిలర్ నుంచి ఎమ్మెల్యేగా రెండు సార్లు గెలుపొందారు. సత్యనారాయణ సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం మంత్రిగా అవకాశం కల్పించింది. దీంతో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూనే ప్రజల సమస్యలను పరిష్కరించడంలో సఫలీకృతులయ్యారు. దీంతో ప్రజా మన్ననలు పొందిన మాజీ మంత్రి సత్యనారాయణను ప్రజలు నేటికీ సత్తన్న అని పిలుస్తారు.

విద్యార్థి నాయకుడిగా..

జిల్లా కేంద్రంలోని కుమార్‌గల్లీకి చెందిన దూదియాల సత్యనారాయణ గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో చదువుకునే రోజుల్లో విద్యార్థి నాయకుడిగా ఎదిగారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఎల్లారెడ్డిలో పని చేశారు. చిన్న వయస్సుల్లోనే నిజామాబాద్ మున్సిపాలిటీలో 1978లో స్వతంత్ర అభ్యర్థిగా కౌన్సిలర్‌గా పోటీ చేసి గెలుపొందారు.

దివంగత ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ పెట్టగానే అందులో చేరారు. 1983 ఎన్నికల్లో నిజామాబాద్ నియోజకవర్గ స్థానానికి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆయనకు ఎలాంటి గన్‌మెన్‌లు లేరు. 1985లో మళ్లీ ఎమ్మెల్యేగా గెలుపొందంతో పార్టీ అధిష్టానం రాష్ట్ర మైన్స్ అండ్, విద్యా, ఎక్సైజ్, రవాణాశాఖ మంత్రిగా అవకాశం కల్పించింది. రవాణాశాఖ మంత్రిగా పని చేస్తున్న సమయంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ప్రతి మండలంలో నూతనంగా బస్టాండ్‌లు నిర్మించారు. 36 మండలాల్లో ఇప్పటికీ అవి చెక్కుచెదరకుండా ఉన్నాయి. నగరంలో పేదలకు ఇండ్లు లేక అవస్థలు పడుతున్న విషయాన్ని నాటి ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్ దృష్టికి తీసుకెళ్లి కేబినెట్‌లో ఇండ్ల స్థలాలు ఇప్పించడానికి తీర్మానం చేయించారు. అందులో భాగంగా నగరంలోని వినాయక్‌నగర్, పాములబస్తీ, మిర్చికాంపౌండ్, నాగారం తదితర ప్రాంతాల్లో వందలాది మంది పేదలకు ఇండ్ల స్థలాలు ఇప్పించిన ఘనత ఆయనదే. నగరంలోని పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధికి కృషి చేశారు.

ప్రజలే స్వచ్ఛందంగా గెలిపించారు

నేను కౌన్సిలర్, ఎమ్మెల్యే, మంత్రిగా పని చేసిన సమయంలో ఎలాంటి ఆర్భాటాలకు పోలేదు. ఒక్క రూపాయి ఖర్చు చేయకుండా ఎమ్మెల్యేగా గెలిచాను. నేను ప్రచారానికి వెళ్తే.. సత్తన్న నీకెందుకే మేమున్నాం కదా అంటూ ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మరీ గెలిపించారు. వాళ్ల నమ్మకాన్ని వమ్ము చేయలేదు. నిస్వార్థంగా సేవా చేశాను. ఇప్పుడు నాకు 74 ఏళ్లు. ఎలాంటి షుగర్, బీపీ లేదు. పదేళ్లుగా బీజేపీలో ఉండి పార్టీ గెలుపునకు కృషి చేస్తున్నాను. ఇప్పటికీ చాలా మంది వచ్చి సలహాలు తీసుకుంటారు. ప్రతినిత్యం వాకింగ్, యోగా సైతం చేస్తాను. ప్రభుత్వం నుంచి వచ్చే పింఛన్‌తో ప్రశాంతంగా జీవనం సాగిస్తున్నా.

– డి సత్యనారాయణ, మాజీ మంత్రి

అభివృద్ధిని చూసి ఓటు వేయండి

బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి



బస్వాపూర్‌లో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్ రెడ్డి

కోటగిరి(రుద్రూర్): బాన్సువాడ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు ఓటు వేయాలని బాన్సువాడ అసెంబ్లీ బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. కోటగిరి మండలంలోని గన్నారం, లింగాపూర్, శ్రీనివాస్ కాలనీ, బస్వాపూర్, అడ్కాస్‌పల్లి, నాగేంద్రపురం, దేవుని గుట్ట తండా, కొత్తపల్లి, ఎక్లాస్‌పూర్ క్యాంపు, ఎక్లాస్‌పూర్ గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి పక్షాల మాయ మాటలు నమొద్దని ప్రజలకు సూచించారు. సీఎం కేసీఆర్ సహకారంతో బాన్సువాడను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలకు బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను వివరించారు. గన్నారం క్రాస్ రోడ్డు పక్కన ఉన్న హోటల్‌లో శ్రీనివాస్‌రెడ్డి కార్యకర్తలతో కలిసి మిర్చి తిని చాయి తాగారు. కార్యక్రమాల్లో బాన్సువాడ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఉమ్మడి మండల అధ్యక్షుడు ఎజాజ్‌ఖాన్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చుకోవాలి



బాన్సువాడ రూరల్: ఉపాధ్యాయులు నిరంతరం బోధనాభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చుకోవాలని బాన్సువాడ మండల విద్యాధికారి నాగేశ్వరరావు సూచించారు. మంగళవారం ఆయన కొత్తాబాదిలో తిర్మలాపూర్ కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే పఠన, రాత అవగాహన సామర్థ్యాలు మెరుగుపడేలా చొరవ తీసుకోవాలన్నారు. విద్యార్థుల స్థాయికి తగ్గట్లు ఉపాధ్యాయులు బోధనాభ్యసన ప్రక్రియలు ఉపయోగించాలన్నారు. సీఆర్పీ రవీందర్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రులను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్ సింగ్

భిక్కనూరు: ప్రజలు ప్రభుత్వాసుపత్రులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ లక్ష్మణ్ సింగ్ అన్నారు. మంగళవారం ఆయన భిక్కనూరు ప్రభుత్వాసుపత్రిని అకస్మాత్తుగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సేవలు అందుతున్నాయని, ప్రజలకు ఈ విషయమై వైద్యసిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. కాన్పులు ప్రభుత్వాసుపత్రుల్లో జరిగేలా చూడాలన్నారు. పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేయాలన్నారు. వైద్యాధికారిణి యెమిమా, ఫార్మసిస్టు వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'సాక్షి' స్పెల్‌బీ



స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న ఎస్‌ఆర్ విద్యార్థులు



ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్‌లో..

- పరీక్షల్లో పోటీపడ్డ విద్యార్థులు

SAKSHI SPELL Bee

నిజామాబాద్ సిటీ: భవిష్యత్‌లో పైచదువులకు 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్‌బీ, మ్యాథ్స్‌బీ పోటీలు ఎంతో ఉపయోగపడతాయని పలువురు విద్యార్థులు పేర్కొన్నారు. నగర శివారులోని ఎస్‌ఆర్, నగరంలోని ఎస్‌ఎఫ్‌ఎస్ పాఠశాలల్లో మంగళవారం నిర్వహించిన పరీక్షల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పరీక్షలు రాశారు. కఠినమైన ప్రశ్నలకు సులువుగా, అర్థమయ్యేలా పరీక్షలు రాసి తమ ప్రతిభను చాటుకున్నారు. పాఠశాల స్థాయిలో 'సాక్షి' ప్రతి ఏడాది నిర్వహించే పరీక్షలతో కాంపిటేటివ్ స్పిరిట్ పెరుగుతుందని, ఇది తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని విద్యార్థులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఎస్ ప్రిన్సిపాల్ జాయిస్ థామస్, ఎస్‌ఆర్ ప్రయిమ్ ప్రిన్సిపాల్ మేరీ, ఐఐటీ ఫ్యాకల్టీ మ్యాక్స్ వెంకట్ కులకర్ణి, ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రతిభకు ఎంతో ఉపయోగం



'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్‌బీ విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. ఎంతో బాగా పరీక్ష రాసాను. తప్పకుండా బహుమతి వస్తుందని ఆశిస్తున్నా. – షేక్ హయానా అహ్మద్, 4వతరగతి, ఎస్‌ఆర్ స్కూల్

సంతోషంగా ఉంది



'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెల్‌బీలో పాల్గొనడం సంతోషంగా ఉంది. ఇలాంటి పరీక్షలు ఉన్నత చదువులకు ఉపయోగపడతాయి. స్పెల్‌బీలో పాల్గొనే అవకాశం కల్పించిన సాక్షికి కృతజ్ఞతలు. – దేదివ్య, 9వతరగతి, ఎస్‌ఆర్ స్కూల్

నాలెడ్జ్ పెరుగుతుంది



స్పెల్‌బీ పరీక్ష రాశాను. దీనివల్ల చదువుపై పట్టు సాధిస్తాను, చదువుపై నాణ్యత, నాలెడ్జ్ పెరుగుతుంది. స్పెల్లింగ్స్ అవగాహన వస్తుంది. స్పోకెన్ ఇంగ్లిష్‌పై పట్టు సాధించేందుకు ఉపయోగపడుతుంది. 'సాక్షి'కి థ్యాంక్యూ. – అనన్య, ఎస్‌ఎఫ్‌ఎస్

ఎంతో సులువుగా..



స్పెల్‌బీ పరీక్ష చాలా సులువగా ఉంది. పరీక్ష రాస్తుంటే ఆనందంగా అనిపించింది. మునుముందు 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించే స్పెల్‌బీలో తప్పకుండా పాల్గొంటాను. – జి.రవీందర్, 7వ తరగతి ఎస్‌ఎఫ్‌ఎస్

మ్యాథ్స్‌బీ బాగా నచ్చింది



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాథ్స్‌బీ పరీక్ష బాగా నచ్చింది. ఈ పరీక్ష రాయడంతో ఎంతో మెరుగుపడతాం. ఎంత ఎక్కువ చదివితే అంత ఎక్కువగా గుర్తుంటుంది. స్పెల్‌బీ ప్రతి సంవత్సరం పెట్టాలి. – ప్రిన్స్ జోసెఫ్, 7వతరగతి, ఎస్‌ఎఫ్‌ఎస్

ఇష్టంతో పరీక్ష రాశా..



నాకు ఎంతో ఇష్టమైన స్పెల్‌బీలో పాల్గొని మ్యాస్‌బీ పరీక్ష రాశాను. దీంతో మ్యాస్‌బీలో ఏఏ పార్షన్ ఉంటుందో తెలుసుకుని దానికి ఎలా సన్నద్ధం కావాలో తెలుసుకున్నాను. – సాత్విక్, 8వతరగతి, ఎస్‌ఎఫ్‌ఎస్

స్నేహితులతో కలిసి..



స్పెల్‌బీ పరీక్షలో పాల్గొనడం సంతోషంగా అనిపించింది. స్నేహితులందరూ స్పెల్‌బీలో పాల్గొంటున్నారని తెలిసి నేను పరీక్షలో పాల్గొన్న. పరీక్ష రాస్తున్నంత ఎంతో సంతోషంగా అనిపించింది. – విష్ణున్, 5వతరగతి, ఎస్‌ఎఫ్‌ఎస్

అవగాహన పెరిగింది



మ్యాథ్స్‌బీ పరీక్ష రాశాను బాగుంది. ఈ పరీక్షలో మ్యాస్‌పై పట్టుసాధించగలను అనే నమ్మకం ఏర్పడింది. ఎంతో సంతోషంగా పరీక్ష రాశాను. సాక్షికి కృతజ్ఞతలు. – ఇందుమతి, 5వతరగతి, ఎస్‌ఎఫ్‌ఎస్

పరీక్షల్లో భయం పోతుంది



సాక్షి స్పెల్‌బీ పరీక్షలో పాల్గొనడం తనకు ఎంతో అనుభూతినిచ్చింది. ఇలాంటి పరీక్షలో పాల్గొంటే రాబోయే పరీక్షల్లో భయం లేకుండా రాసే అవకాశం ఉంటుంది. – కృతజ్ఞ, 5వతరగతి, ఎస్‌ఎఫ్‌ఎస్

బైక్‌లో పాము కలకలం

ఎడపల్లి: మండలంలోని జానకంపేట్ గ్రామంలో ఓ బైక్‌లోకి పాము చొరబడింది. ఇది చూసిన స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన బైకును స్టార్ట్ చేస్తుండగా సీటు లోపల పాము కనిపించడంతో స్థానికులకు సమాచారం అందించారు. దీంతో వారు పాములు పట్టే వ్యక్తికి సమాచారం అందించడంతో పాముని పట్టుకొని అడవిలో వదిలేశారు. దీంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

రైస్‌మిల్‌పై దాడులు

ఖలీల్‌వాడి: నగరంలోని వెంకటరామయ్య రైస్‌మిల్‌పై దాడిచేసి పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐలు అజయ్‌బాబు, అంజయ్య మంగళవారం తెలిపారు. సుమారు 54 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నామని వీటి విలువ రూ. 8.50 లక్షలు ఉంటుందన్నారు. బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

ఒకరి అదృశ్యం



వర్ని: బోధన్ పట్టణానికి చెందిన షేర్ల స్వామి గౌడ్ అనే వృద్ధుడు అదృశ్యమైనట్లు ఎస్సై కృష్ణకుమార్ మంగళవారం తెలిపారు. పాతవర్ని గ్రామంలో ఈ నెల 2న స్వామి గౌడ్ తమ్ముడు మృతి చెందగా దినకర్మకు హాజరై ఇంటికి చేరుకోలేదు. దీంతో బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రూ.2.39 కోట్ల నగదు రిలీజ్

సుభాష్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మోడల్ కోడ్‌లో భాగంగా పోలీస్, ఎస్‌ఎస్‌టీ, ఎఫ్‌ఎస్‌టీ బృందాలు జిల్లావ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నాయి. అందులో భాగంగా ఇప్పటివరకు 119 కేసులు నమోదు చేసి రూ.4,44,27,205 ఆధారాలు చూపని నగదు, బంగారాన్ని సీజ్ చేశారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీ విచారణ నిమిత్తం 102 కేసులకు సంబంధించి రూ.2,39,61,458 నగదును రిలీజ్ చేశారు. రెండు కేసులకు సంబంధించి రూ.1,04,85,500 నగదును ఆదాయపన్ను శాఖకు అప్పగించారు. మరో నాలుగు కేసులకు సంబంధించి రూ.71,06,310 నగదును ఆదాయ పన్నుశాఖకు సిఫారసు చేశారు. 10 కేసులకు సంబంధించి రూ.22,21,937 నగదుపై విచారణ చేపట్టాల్సి ఉంది.

పెట్రోల్ దొంగిలించిన వ్యక్తికి దేహశుద్ధి

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో ద్విచక్ర వాహనాల నుంచి పెట్రోల్ దొంగిలించిన వ్యక్తిని స్థానికులు పట్టుకొని దేహశుద్ధి జేపీఎన్ రోడ్‌లో సోమవారం రాత్రి పలు ద్విచక్ర వాహనాల నుంచి పెట్రోల్‌ను దొంగలిస్తున్న వ్యక్తిని స్థానికులు పట్టుకున్నారు. దేహశుద్ధి చేస్తుండగా పారిపోయాడు. పోలీసులు రాత్రి సమయంలో పికెటింగ్ చేయాలని స్థానికులు కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



మోపాల్: మండలంలోని న్యాల్‌కల్‌కు చెందిన సాయిరాం (21) చికిత్స పొందుతూ మృతిచెందాడు. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. న్యాల్‌కల్‌కు చెందిన సాయిరాం ఓ హోటల్‌లో వెయిటర్‌గా పని చేస్తున్నాడు. తన నానమ్మ, తాతతో కలిసి టీవీఎస్ ఎక్సెల్‌పై ఆదివారం న్యాల్‌కల్ నుంచి మల్లారం వైపు వెళ్తున్నాడు. అదేసమయంలో మల్లారం నుంచి న్యాల్‌కల్ వైపు అదే గ్రామానికి చెందిన నరేశ్, కళ్యాణ్ కారులో వస్తున్నారు. ధర్మారం శివారులో ఆటోను ఓవర్ టేక్ చేయబోయి సాయిరాం కారును ఢీకొన్నాడు. ఈ ఘటనలో సాయిరాం, ఆయన నానమ్మకు తీవ్ర గాయాలు కాగా జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. సాయిరాం తలలో రక్తం గడ్డ కట్టగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. ఇదిలా ఉండగా మృతుడి కుటుంబీకులు నరేశ్, కళ్యాణ్ ఇంటి ఎదుట ఆందోళన చేసేందుకు యత్నించారు. సీఐ వెంకట నారాయణ, ఎస్సైలు మహేశ్, గంగాధర్, గ్రామ పెద్దలు వారిని సముదాయించే ప్రయత్నంచేశారు. పోలీసులు, గ్రామ పెద్దలు బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని ఒప్పించడంతో చివరకు ఆందోళనను విరమించారు. అనంతరం సాయిరాం అంత్యక్రియలు నిర్వహించారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

రెంజల్: అప్పుల బాధ తట్టుకోలేక ఓ యువకుడు గోదావరి నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కందకుర్తిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని ఖానాపూర్‌కు చెందిన మడుపతి శివకుమార్(23) ఓ ప్రైవేట్ షాపింగ్‌మాల్‌లో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఇంటి నుంచి బయలుదేరిన శివకుమార్ కందకుర్తి గోదావరి వంతెన వద్దకు వచ్చి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బైక్, సెల్‌ఫోన్‌ను వంతెనపై ఉండటంతో స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కుటుంబీకులు సాయంత్రం శివకుమార్‌కు ఫోన్ చేయగా పోలీసులు జరిగిన విషయాన్ని వెల్లడించారు. మంగళవారం జాలర్లతో వెతికించగా మృతదేహం లభించిందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా శివకుమార్ తాను పనిచేస్తున్న షాపులో కొందరికి అప్పు ఉన్నానని వాటిని తీర్చాలని, ఐ మిస్ యు అంటూ చెల్లికి మెసేజ్ ద్వారా సమాచారం అందించినట్లు తెలిపారు. మృతుడి తండ్రి రాచప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గోదావరిలో పడి మహిళ..

నవీపేట: మండలంలోని యంచ గోదావరి నదిలో ఓ మహిళ పడి మృతి చెందినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ మంగళవారం తెలిపారు. వర్ని మండలంలోని ఉమ్మపూర్ గ్రామానికి చెందిన మూగ, చెవిటి ఉన్న సట్టి గంగామణి (38) తండ్రి గంగబోయి, సోదరి శివవ్వతో కలిసి సోమవారం బాసరలోని సరస్వతీ దేవి ఆలయానికి వచ్చారు. గోదావరిలో స్నానం చేస్తానని వెళ్లిన గంగామణి తిరిగి రాలేదు. పరిసర ప్రాంతాల్లో వెతికిన ఆచూకీ దొరకలేదు. మంగళవారం ఉదయం యంచ శివారులోని గోదావరి నదిలో గంగామణి మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కామారెడ్డి క్రైం: ప్రమాదవశాత్తు లారీ కింద పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. దేవునిపల్లి గ్రామానికి చెందిన మీసాల నితిన్(21) డిగ్రీ పూర్తి చేసి ఓ రియల్ ఎస్టేట్ కార్యాలయంలో ఉద్యోగం చేస్తున్నాడు. స్కూటీపై నిజామాబాద్ రోడ్డు వైపు వెళ్తుండగా రాంగ్ రూట్లో వచ్చిన మరో బైక్ ఢీకొన్నది.

ఈ క్రమంలో పక్కనుంచి వెళ్తున్న ధాన్యం లారీ వెనక చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

భార్యపై హత్యాయత్నం

డిచ్‌పల్లి: బీబీపూర్ తండాలో బానోత్ సరోజపై భర్త బానోత్ రాజు కత్తితో దాడి చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన బగ్గీబాయి, గణపతిల పెద్ద కుమార్తె సరోజను ఇందల్వాయి మండలం గండితండాకు చెందిన బానోత్ రాజుకు ఇచ్చి పెళ్లిచేశారు. భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో ఆరు నెలలుగా సరోజ తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఎన్నిసార్లు పిలిచినా భార్య ఇంటికి రాకపోవడంతో భర్త ఆమెపై కోపం పెంచుకున్నాడు. సోమవారం రాత్రి ఇంట్లో చొరబడి సరోజపై కత్తితో దాడి చేసి చంపడానికి యత్నించాడు. తీవ్రంగా గాయపడ్డ సరోజను తండా వాసులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సరోజ తల్లి బగ్గీబాయి ఫిర్యాదు మేరకు రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అంబంలో చోరీ

రుద్రూర్: మండలంలోని అంబం (ఆర్) గ్రామంలో రెండిండ్లలో చోరీ జరిగినట్లు ఎస్సై నీరేశ్ మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన చిన్న సాయిలు తన ఇంటికి తాళం వేసి వేరు గ్రామానికి వెళ్లారు. మంగళవారం వచ్చి చూసే సరికి చోరీ జరిగినట్లు గుర్తించారు. రెండు తులాల బంగారం, రూ.60వేల నగదు దుండగులు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. గ్రామంలోని మరో ఇంట్లో దుండగులు రూ. ఏడు వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పెద్దమ్మ ఆలయంలో..

ఎడపల్లి: మండల కేంద్రంలోనిపెద్దమ్మ ఆలయంలో మంగళవారం ఉదయం చోరీ జరిగింది. ఆలయంలోని హుండీని దుండగులు పగులగొట్టి నగదును దొంగిలించినట్లు ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్రం పేర్కొన్నారు.

మొబైల్ షాపులో..

రుద్రూర్: సులేమాన్‌నగర్ గ్రామంలో ఉన్న మొబైల్ షాపులో సోమవారం రాత్రి చోరీ జరిగింది. దుకాణం వెనుక భాగంలో రేకును దుండగులు కోసి దొంగతనానికి పాల్పడ్డారు. షాపులో ఉన్న 17 మొబైల్స్ ఎత్తు కెళ్లినట్టు పోలీసులు తెలిపారు. దొంగను పట్టుకుని ఫోన్లను రికవరీ చేయాలని బాధితుడు కోరాడు.

వర్నిలో ద్విచక్ర వాహనం..

వర్ని: మండల కేంద్రంలో ఇంటి ముందు నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం తెల్లవారుజామున దొంగిలించినట్లు బాధితుడు పేర్కొన్నాడు. సోమవారం రాత్రి ఇంటిముందు పార్క్ చేసిన తన బైక్ కనిపించలేదని తెలిపాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నాడు. ఇటీవల వర్ని పీఎస్ పరిధిలో ద్విచక్ర వాహనాలు, దొంగతనాలు ఎక్కువ అయ్యాయని పోలీసులు గస్తీ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

కామారెడ్డి క్రైం: మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి అంబేద్కర్ విగ్రహం ఎదురుగా ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో ఓ వ్యక్తి చోరీకి యత్నించాడు. ఈ ఘటన మంగళవారం వేకువజామున చోటు చేసుకుంది. ముసుగు ధరించి లోపలికి వచ్చిన ఓ వక్తి ఏటీఎంను పగులగొట్టి నగదును బయటకు తీసేందుకు విఫలయత్నం చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. నిందితుడిని మండలంలోని గర్గుల్ గ్రామానికి చెందిన చిట్టాపురం నరేశ్‌గా గుర్తించారు.